# దీపంశోకం

శ్రీ ఏకుల శ్రీనివాసులు

అది మహా పట్టణం. ఆ పట్టణ వీధులలో ఎన్నో ధనవంతుల మేడలున్నాయి. రకరకాల లైట్లు వెలుగుతున్నాయి. ప్రతి యింటా దీపపు ప్రమిదలు చక్కగా తీర్చిదిద్దినట్లు శోభగా బారులుతీర్చి నాట్యం చేస్తున్నట్లుగా ప్రకాశిస్తున్నవి. వాటిముందు, వీధిలో వున్న మునిసిపాలిటీ ఎలక్ట్రిక్ దీపాలు వెలవెల బోతున్నాయి. ఈ చిన్న ప్రమిద దీపాలు తమ ఔన్నత్యానికి విలువ లేకుండాచేశాయి, అన్న దుఃఖంతో ఏడుస్తున్నాయా అన్నట్లు కాంతి విహీనంగా వెలుగుతున్నాయి. ఇంతలో - ఒక మునిసిపాలిటి దీపం కెదురుగావుండే యింట్లోనుండి ఒక అబ్బాయి, పరుగెత్తుకుంటూవచ్చి ఒక చిచ్చుబుడ్డి వెలిగించాడు. అదిచూచి మునిసిపాలిటి దీపం చిన్నబోయింది. ఆహా! ఎంత చక్కని పూలు కాంతిగా వస్తున్నవి, ఆ చిన్న బుడ్డిలోనుండి, అని అసూయపడింది. తనకంత అదృష్టంలేదుగదా! అని వాపోయింది. అయితే మాత్రం తన గౌరవానికేం! లోపమా! బజార్లో అంగళ్లముందు రంగు రంగుల, తన సోదర బల్బులు వింతగా ప్రకాశిస్తూవుంటే దారినపోయేవారు వాటినిచూచి ఆశ్చర్యపడడం లేదూ! ఇదెంత, వాటిముందు, కొంతసేపు వెలిగి ఆరిపోతుంది, వెధవ చిచ్చుబుడ్డి, అని తనను, తన జాతిని సమర్థించుకుంది. తక్కిన తన సోదర మునిసిపాలిటీ దీపాలు తన సోదర దీపంయొక్క సమర్థతను మెచ్చుకున్నట్లుగా గర్వంగా దానివంక చూశాయి.

ఇంతలో ఆ యింటిలోనుండి ఓ యువతి, ఆ అబ్బాయి తల్లి కాబోలువచ్చి "ఒరే! రాముా! చెయ్యి కాల్తుందిరా! దూరంగా రా" అన్నది.

అబ్బో! ... దానికికూడా నా లాంటి శక్తి వుందన్నమాట, అని దీపానికి కోపం వచ్చింది. మరలా దానిని ఏమీచెయ్యలేక "అసలు ఈ దీపావళిపండుగ నా పాలిట శనిదేవతలాగున్నది. లేకపోతే, నాకంటే ఆకారంలో చిన్నది, నన్ను యింత పెద్ద దీపాన్ని వెక్కిరించేటంతటి వస్తువులను తయారుచేసి ప్రతి ఏటా నన్ను అవమానపరుస్తుంటోంది" అని దీపావళి మీద తన అక్కసు అంతా వెళ్లగక్కింది. "అయినా ఆ చిచ్చుబుడ్డి చెయ్యేం కాలవగలదు. అంతేగా! తను అనుకుంటే షాక్ తగిలించి ప్రాణాలైనా తీసెయ్యగలదు" అని సగర్వంతో అనుకుంది.

ఇదంతా ఏమీ లెక్కచేయనట్లుగా ఆ చిచ్చుబుడ్డి తేజోవంతంగా ఉవ్వెత్తున కాంతి కిరణాలు కురిపించి ఆ దీపాన్ని వెక్కిరించినట్లు ఆరిపోయింది.

ఇదిచూచి ఆ దీపం "పాడు జీవితమూ యవ్వనం మూడునాళ్ల ముచ్చటలోయి" అన్నట్లుగా పకపక్కన నవ్వింది.

ఆ నవ్వువిని చిచ్చుబుడ్డి "నేనుపోతేపోయాను. మా అన్నలూ, తమ్ముళ్లూ యింకా వున్నారుగా! దీనిపనిపడతారుగా" అని అనుకుంది ధీమాగా.

ఆ అబ్బాయి మరలా ఓ పెద్ద కాకరవత్తి వెలిగించాడు. కనులపండువుగా పూలు రాల్తుంటే దీపం తన్నుచూచి వెక్కిరిస్తున్నట్లుగా కించపడింది. ముఖం దిగాలుపడింది.

ఇంతలో యింతకుముందు కాలిన చిచ్చుబుడ్డి దారినపోయేవాడి కాలిక్రిందపడి చుర్రున వేడిగా అంటించింది. వాడు అబ్బా అని అరిచాడు. ఆ అరుపు దీపానికి తొట్రుపాటు కలిగించింది. "ఇప్పుడు చూశావా నా ప్రతిభ" అని చిచ్చుబుడ్డి, తనను ఎత్తిపొడుస్తున్నట్లుగా భావించింది. దీపం మరలా ధైర్యం తెచ్చుకొని ఆ పిరికి భావాలను దూరంగా త్రోసిపుచ్చి "ఇది మనలను ఏంచెయ్యగలదు" అన్న ధీమాతో ఓ చిరునవ్వునవ్వి వూరుకుంది.

మరలా ఆ అబ్బాయి ఒక విష్ణుచక్రం వెలిగించాడు. అది గిర్రున తిరుగుతోంది. దీపం అటూ

యిటూ తిరుగులాడింది. ఇదేసమయం అనుకుని చిచ్చుబుడ్డి "అదేమిటి? మా బావగారిది విష్ణుచక్రం దెబ్బకు వణుకుచున్నట్లున్నావే?" అన్నది వెటకారంగా.

"'అబ్బే! నేనేమిటి? దానికేమిటి? భయపడటమేమిటి? మీరు వందమంది కలసివచ్చినా నేను భయపడను. మా పెద్దన్నయ్య వాయువు నను చూచిపోవటానికి చాలా ఆతృతతో పరుగెత్తుకొచ్చాడు. దానివలన నేను సంతోషంతో అటూ యిటూ ఆనంద డోలమాలికలలో వూగాను. కానీ మిమ్మల్ని చూచి కాదు. నన్నీవిధంగా అవమానపరిచిన నిన్ను వూరికే విడిచిపెట్టను. ఉండు నీపని చెబుతా. మా మేనత్త కొడుకు వరుణున్ని పిలిచానంటే మీపని అవుతుంది." అని వరుణున్ని ఎలుగెత్తి పిలిచింది. పిలిచిందే తరువాయిగా వరుణుడు పరుగెత్తుకుని వచ్చాడు. తిరుగుతూవున్న విష్ణుచక్రం వానదెబ్బకు తట్టుకోలేక ఆరిపోయి, టపీమని ఆగిపోయింది. దీపం సహజమైన గర్వంతో ఓ అస్పష్టమైన నవ్వు నవ్వింది. చిచ్చుబుడ్డికి ఎక్కడలేని కోపం వచ్చింది. ఈ దీపం పని యిలా కాదు, దీనికి తుదముట్టా గర్వం అణచాలని యింట్లోవున్న తన పెదతండ్రి "ఆటంబాంబుకు" కబురంపింది. దీపం తనకేం భయం, పిలుచుకుంటే పిలుచుకో అన్నట్లుగా ఓ కోరచూపు చూసింది.

ఆ అబ్బాయి పరుగెడుతూవెళ్ళి ఓ ఆటంబాంబును తీసుకొనివచ్చి వెలిగించాడు. వెనిగించడమే తరువాయిగా, వర్షం కురుస్తున్నా, దానితో తనకు లెక్కలేనట్లుగా, అది ఢమాలుమని శబ్దంచేసింది.

ఆ శబ్దానికి పక్కయింటిలో వున్న ఓ చంటిపాప కెవ్వున కేకవేసింది. దీపానికి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. తన కాధారమైన ఆ యినుప స్తంభం వూగులాడుతున్నట్లనిపించింది. ముచ్చెమటలు పోశాయి. మైకం కమ్మింది. కళ్ళు మూసుకుపోయాయి. టపీమని క్రిందపడి ముక్కలుముక్కలుగా విరిగి వూరుకుంది.

తక్కిన మునిసిపాలిటీ దీపాలు, తమ సోదరదీపం యొక్క విచ్ఛిన్నతనుగూర్చి వాపోతూ, విచారంగా కాంతివిహీనంగా, దాని ఆత్మశాంతికోసం ప్రార్థిస్తూ వెలుగుతున్నవి. ఆ పరిస్థితిచూచి చిచ్చుబుడ్డి వగైరాలు ఆటంబాంబును కొనియాడుతూ, మితిలేని సంతోషంతో కేరింతలుకొట్టాయి. వాటినిచూచి, వాటి చుట్టూచేరినపిల్లలు ఆనందంతో ఘల్లంతుగా నవ్వేరు. ఒకతనువచ్చి రోడ్డులో ముక్కలై విరిగిన గ్లాసు పెంకులను తీసి, కుప్పతొట్టిలో వేసేడు.

అన్నగారైన వాయువు, మేనత్తకొడుకు వరుణుడు దీపానికి సానుభూతి చూపిస్తూ, హోరుగా గాలి వీస్తుంటే, జోరుగా వర్షం కురిసింది. రేడియోలో "కలయిదనీ, నిజమిదనీ, తెలియదులే బ్రతుకింతేనులే" అనే పాట కమ్మగా, సన్నగా వినవస్తోంది.

# మన దేశంలో కోకో ఉత్పత్తి

భారత దేశంలో 'కోకో' ఉత్పత్తికి క్రమంగా అవకాశాలు మెరుగగుచున్నవి.

ఒకప్పుడు 'కోకో' ఉత్పత్తిలో అగ్రస్థానము నాక్రమించియుండిన పశ్చిమ ఆఫ్రికా యీ నాడు ఆస్థానాన్ని కోల్పోడానికి అచ్చటి కోకో పైరులకు ఆశించిన వివిధ జబ్బులేకారణము. ఈ సందర్భమున యితర దేశాలు త్వరిత గతిన కోకో ఉత్పత్తిని, వ్యాపారాన్ని పెంపొందించుకుంటున్నవి.

మన దేశంలో నిర్ణీత దక్షిణ ప్రాంతాలలో ముప్పైసంవత్సరాలనుండి విజయవంతంగా కోకో పైరుచేయబడుచున్నది. అనుభవాన్ని బట్టి మద్రాసు, ఆంధ్ర, తిరువాన్కూర్ - కొచ్చిన్, మైసూరు కొండల ప్రదేశాలలో ఉత్పత్తినధికంచేయడానికి అవకాశాలు విరివిగా కనుపిస్తున్నవి. దానికనువైన శీతోష్ణస్థితి 50° F నుండి 100° F వరకు; వర్షము సంవత్సరము మొత్తముమీద 60 అంగుళాలనుండి 80 అం.-అరటి, కాఫీ, రబ్బరు తోటల కనువైన నేలగానున్నచో 'కోకో' విస్తారముగా పైరగును.

'ICOAR'